క్లుప్తంగా

కాలానికతీతం కొడవటిగంటి సాహిత్యం



నాగజ్యోతిని సత్కరిస్తున్న సాహితీ అభిమానులు

ఐ.పోలవరం: కొడవటిగంటి సాహిత్యం కాలాలకు అతీతమైందని ప్రముఖ సాహితీ వేత్త దొండపాటి నాగజ్యోతి అన్నారు. భావ విప్లవ కథా రచయిత కొడవటిగంటి కుటుంబరావు వర్ధంతిని పురస్కరించుకుని ఐ.పోలవరంలో సాహితీ సరిగమలు కార్యక్రమంలో పలువురు పాల్గొని ప్రసంగించారు. ప్రజ్ఞ సాహితీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొడవటిగంటి సాహిత్యం – ప్రభావాలు అనే అంశంపై నాగజ్యోతి ప్రసంగించారు. డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డి.నాగజ్యోతి, ఏఎస్ఎస్ఎన్ మూర్తి, విత్తనాల వర ప్రసాదరావు, రామేశ్వరపు బాబూరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సలాది సత్తిబాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రేవు అప్పలస్వామి, డి.నారాయణరావు, ప్రత్తి సత్తిబాబు, జె.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యానాంలో అభివృద్ధి శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి

యానాం: పుదుచ్చేరిలో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వంలో ఇద్దరు నాయకులు ఉన్నప్పటికీ యానాం నియోజకవర్గంలో కొన్నేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం దూరమైందని బ్లాక్‌కాంగ్రెస్ నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఉన్నప్పటికీ ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని, దీంతో మూడో వ్యక్తి యానాంకు ప్రాతినిధ్యం వహించాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ వంటి ఆరోగ్య పథకాలు సైతం అమలు జరగని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నప్పటికీ ఎక్కడా ఖర్చు చేయడం లేదని, దీంతో రహదారులు సైతం అధ్వానంగా ఉన్నాయన్నారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్ మాట్లాడుతూ మల్లాడి కృష్ణారావు ప్రజా వ్యతిరేక వైఖరి వల్లే యానాంలో రాజకీయాలు భ్రష్టుపట్టాయని విమర్శించారు. సమావేశంలో నాయకుడు చెక్కల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయానికి భక్తుల తాకిడి

అయినవిల్లి: ఆది గణపతి అయినవిల్లి విఘ్నేశ్వరాలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారు జామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి సన్నిధిలో చిన్నారులకు అక్షరభ్యాసం, తులాభారం, అన్నప్రాసన కార్యక్రమాలు, వాహన పూజలు నిర్వహించారు. 2,400 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం స్వామివారికి వివిధ పూజ టికెట్లు, అన్నదాన విరాళాలు ద్వారా రూ.2,63,403 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకటదుర్గ భవాని తెలిపారు.

అంతర్వేది క్షేత్రంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గ్రామస్తులు ఉట్టికొట్టే కార్యక్రమం స్థానిక యాదవ సంఘం, యూత్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణ పరమాత్మకు అర్చకులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆనందోత్సాహాల మధ్య యువకులు పోటాపోటీగా ఉట్టికొట్టారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్, వాహనకారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. సఖినేటిపల్లికి చెందిన భక్త బృందం సభ్యులచే మురళీ కోలాటం నిర్వహించారు.

బాలాజీ ఆలయానికి రూ.1.52 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం రూ.1,52,763 ఆదాయం వచ్చింది. పవిత్ర శ్రావణమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీదేవి, భూదేవి సమేతుడైన బాల బాలాజీ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.58,998 విరాళాలుగా అందించారు. స్వామి వారిని 2,600 మంది దర్శించుకున్నారని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. 1,500 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

మాకొద్దు.. ఈ ఇళ్లు

- గృహాలను ఖాళీ చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు
- సమస్యలతో విసిగిపోతున్న వైనం



టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద అధికారులు, ప్లాట్‌దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్ (ఫైల్)



వర్షానికి ముంపు బారిన పడిన బోడసకుర్రు టిడ్కో సముదాయ ప్రాంతం (ఫైల్)

అమలాపురం టౌన్: మురుగు పోదు.. తాగునీరు ఉండదు.. ఎక్కడికక్కడే సమస్యలు.. అల్లవరం మండలం బోడసకుర్రు శివారులో టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద పరిస్థితి ఇది. అమలాపురం పట్టణంలో ఇళ్లులేని 1,632 మంది పేదలకు ఆరేళ్ల కిందట ఈ టిడ్కో గృహ సముదాయాలను కేటాయించారు. పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న బోడసకుర్రు శివారులో టిడ్కో ఇళ్లు ఇచ్చినప్పటికీ మొదట్లో దాదాపు వెయ్యికి పైగా కుటుంబాలు నివాసం ఉన్నాయి. మిగిలిన ప్లాట్లలో లబ్ధిదారులు వారానికో, నెలకోసారి వచ్చి తమ ప్లాట్ల నిర్వహణ చూసుకుని తాళాలు వేసి వెళ్లిపోయేవారు. ఇప్పుడు అదే లబ్ధిదారులు అసౌకర్యాల చెరతో అవస్థలు పడలేక కేవలం 600 మంది మాత్రమే తమ ప్లాట్లలో ఉంటున్నారు. మిగిలిన వెయ్యికి పైగా లబ్ధిదారులు నివాసం ఉండకపోవడంతో ఖాళీగా ఉంటున్నాయి. 38 ఎకరాల భూమిని అప్పట్లో టిడ్కో ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించింది. 33 ఎకరాల విస్తీర్ణంలో 52 అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందులోని ప్లాట్‌లను కేటాయించింది. ఎంతో ఆనందంగా గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులు అసౌకర్యాల నడుమ ఉండలేక ఖాళీ చేస్తున్నారు.

లీకేజీలు.. ఇబ్బందులు

అపార్ట్‌మెంట్లలో కొన్ని ప్లాట్‌లు గోడల నుంచి నీరు లీకవ్వడం, వర్షం వచ్చినప్పుడు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ప్లాట్‌ల గోడల నుంచి నీరు చెమర్చడం, కొన్ని ప్లాట్‌లలో శ్లాబ్ పెచ్చులూడడం, మరికొన్ని ప్లాట్ బాత్‌రూమ్‌ల్లో వాడిన నీరు శ్లాబ్ ద్వారా కిందకు రావడం జరుగుతోంది. ఈ అపార్ట్‌మెంట్ల సముదాయం చుట్టూ ప్రహరీ లేక పశువులు, కుక్కలు, పందులు వంటి జంతువులు అపార్ట్‌మెంట్ల వద్దకు వచ్చి ఇబ్బంది పెడుతున్నాయి. అలాగే ప్లాట్లలో నివాసం ఉంటున్న సామాజిక పింఛనుదారులు 8 కిలోమీటర్ల దూరంలో అమలాపురం మున్సిపాలిటీకి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇంతటి భారీ టిడ్కో సముదాయానికి ఆరోగ్య కేంద్రం లేక ఎవరికైనా సుస్తి చేస్తే పట్టణానికి వెళ్లాల్సిందే. ఈ సమస్యలపై ఎవరూ పట్టించుకోవడం లేదు.

కలెక్టర్ వచ్చి.. పరిశీలించి..

ఇటీవల ఓ ప్లాట్‌దారుడు జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో టిడ్కో ప్లాట్‌దారుల సమస్యలు, అసౌకర్యాలపై వినతిపత్రం అందించారు. ఆ వినతి పత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఇటీవల టిడ్కో అపార్ట్‌మెంట్లను స్వయంగా సందర్శించి సమస్యలను పరిశీలించారు. ప్లాట్‌దారులు చెప్పిన అసౌకర్యాలపై ఆయన స్పందించి తక్షణమే అంచనాలు తయారు చేయమని టిడ్కో, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రూ.3.14 కోట్లతో టిడ్కోలోని అన్ని సమస్యలకు పరిష్కారాన్ని చూపేలా అంచనాలు తయారు చేశారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ కూడా ఇటీవల కాలంలో టిడ్కో ఇళ్లను తరచూ పర్యవేక్షిస్తూ కొన్ని సమస్యలకు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్, కమిషనర్ చర్యలతో ప్లాట్‌దారుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

నీరు లేదు.. మురుగు పోదు

ఈ టిడ్కో గృహ సముదాయాలకు మురుగు కాలువల వ్యవస్థ లేదు. రూ.కోటి అంచనాతో ఇక్కడ అవుట్ లెట్ డ్రైనేజీ నిర్మించాలన్న ప్రతిపాదన మూలన పడింది. ఫలితంగా భారీ వర్షాలు పడితే అపార్ట్‌మెంట్ పరిసరాలన్నీ ముంపు బారిన పడుతున్నాయి. అసలు ప్లాట్‌దారులు వాడకం నీరు బయటకు వెళ్లే దారిలేదు. తాగు నీటిని మున్సిపాలిటీయే వారానికి కొన్ని ట్రిప్పుల ట్యాంకర్లతో సరఫరా చేస్తోంది. అరకొరగా అందుతున్న తాగునీటితో అవస్థలు పడుతున్నారు. టిడ్కో ఇళ్ల సముదాయానికి శ్మశానం లేదు. ఇక్కడ ఎవరైనా మృతి చెందితే ఆ మృతదేహాన్ని వ్యయ ప్రయాసలకోర్చి ఏదైనా వాహనంలో అమలాపురం పట్టణంలోని శ్మశానానికి తీసుకు వెళ్లి అంత్యక్రియలు నిర్వహించే దుస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ టిడ్కో ప్లాట్‌లలో ఆరేళ్లలో 65 మంది మృత్యువాత పడినప్పుడు ఆ మృతదేహాలను అమలాపురం తీసుకువెళ్లి అంత్యక్రియలు చేసినట్లు చెబుతున్నారు.

గత స్మృతులను నెమరువేసుకుంటూ..



పటవల హైస్కూల్‌లో కలుసుకున్న 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

తాళ్లరేవు: వారంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు.. ఉద్యోగ, వ్యాపార రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్నారు.. వారంతా తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్న తడవుగా నెలరోజుల లోపులోనే ఎక్కడెక్కడ ఉన్న వారందరినీ ఒకచోటకు చేర్చి ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. పటవల శ్రీమతి, శ్రీపోలిశెట్టి వీరాంజనేయులు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా సుమారు 25 ఏళ్ల తర్వాత ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనంద డోలికల్లో మునిగి తేలారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. తోటి స్నేహితులతో కలసి కబుర్లు చెప్పుకొంటూ సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మందాల వీరభద్రరావు, కాకర్లపూడి సత్యనారాయణ, శివ సత్యనారాయణలకు పాదపూజ చేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు చెక్కా అజయ్‌వర్మ, కట్టా శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ చాలా ఏళ్ల తరువాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం మధురానుభూతిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సలాది వెంకటనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామ కోలాటివారి రేవులో కొత్తగా నిర్మించిన శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ పురోహితుడు కందికొండ భాస్కరశర్మ, గ్రామస్తుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ఠ చేశారు. గోదృష్టి అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సంగాని దాసు ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం చేశారు. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, నాయకులు కొపనాతి నాగరాజు, బొంతు మోహన్, కొల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జి.వేమవరంలో..

జి.వేమవరం రామాలయం వీధిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీగణపతి పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితుడు పూజ్యం సత్యనారాయణ శర్మ నేతృత్వంలో గవ్యాంతపూజలు, పీఠపూజ, రత్నన్యాసం చేశారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామి, అభయాంజనేయ స్వామి, నాగబంధన యంత్ర, బింబ ప్రతిష్ఠ చేశారు. అనంతరం మహాకుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, దృష్టి కుంభం, గోవు దర్శనం చేయించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురంలో కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే వెంకట సతీష్‌కుమార్ తదితరులు



జి.వేమవరంలో లక్ష్మీగణపతి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కాట్రేనికోన: స్థానిక మావుళ్లమ్మ ఆలయం వద్ద కమిటీ చైర్మన్ ఆణివిళ్ల సాయిబాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు నిర్వహించారు. మంత్రిప్రగడ శ్రీనివాస్ దంపతులచే అర్చకులు ఆణివిళ్ల ఫణిశర్మ ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం

అమలాపురం రూరల్: మండలంలో బండారులంక మట్టపర్తి వారిపాలెంలో రామాలయం వద్ద సిద్ధి బుద్ధి సమితి వరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో వినాయక చవితి మహోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చవితి ఉత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 27వ తేదీ బుధవారం వినాయక చవితి రోజున కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమై 11 రోజుల పాటు జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కడలి రాజు, మట్టపర్తి రాంబాబు, అజయ్ కుమార్, ప్రసాద్, కృష్ణ నాగేంద్ర, బూరయ్య, నాగేశ్వరరావు, పండు, మామిడిశెట్టి ఈశ్వర్, సత్తిబాబు, శ్రీనివాస్, శేషగిరి రావు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

అమలాపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాలకు అమలాపురం పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ నెల 27న జరగనున్న వినాయక చవితి పండగ కోసం ఇప్పటి నుంచే చలువ పందిళ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో బంగారు, వెండి, డైమండ్ వర్తకుల సంఘం (బులియన్ అసోసియేషన్) ఏటా చవితి పండగకు విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిలబెట్టి నవరాత్ర మహోత్సవాలను భారీగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఉత్సవాలకు రాట ముహూర్తం చేసి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. స్థానిక గడియార స్తంభం సెంటరులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద కూడా చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. కూరగాయల మార్కెట్‌లో కూడా చలువ పందిళ్ల నిర్మాణాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పట్టణంలో దాదాపు 53 చోట్ల వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.



బండారులంక మట్టపర్తి వారిపాలెంలో చవితి మహోత్సవాలకు పందిరిరాట వేసిన కమిటీ సభ్యులు



బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి పందిరి వేస్తున్న దృశ్యం

జోరు వాన.. జ్వరాల విజృంభణ

- గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం
- ప్రతి ఇంటా జ్వర పీడితులు
- దోమల ఉధృతి పెరగడంతో వ్యాధుల వ్యాప్తి
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కలవచర్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భాగ్యశ్రీ



కడియం-వెదురుమూడి రోడ్డు పక్కన అపరిశుభ్రత

ఆలమూరు: వాతావరణ పరిస్థితులతో పాటు వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల ఇటీవల జోరుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఇంట్లోంచి బయటకు వచ్చి దైనందిన కార్యక్రమాలను చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో వర్షాల ప్రభావంతో చెత్త చెదారం, వ్యర్థాలు రహదారులు, కూడళ్లు, డ్రెయిన్లలో పడవేయడంతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. అపరిశుభ్రత కారణంగా ప్రజలు జ్వరాలు, అంటు వ్యాధుల బారినపడున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

వాతావరణంలో మార్పులే కారణం..

క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు సామాజిక ఆస్పత్రుల్లో నిత్యం వందలాది మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఇంటింటా జ్వర పీడితుల సంఖ్య అధికమైంది. ప్రధానంగా ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, రొంప లక్షణాలు ఎక్కువ మందికి ఉండటంతో వారిని రోజుల తరబడి నీరసం వేధిస్తోంది. ఏడాది కంటే ఇప్పుడు జ్వరాల తీవ్రత అధికంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతోపాటు అపరిశుభ్రత వల్ల దోమలు ఉధృతి అధికమవడంతో పల్లెలు, పట్టణాలు అనే తారతమ్యం లేకుండా వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

పారిశుధ్యంపై దృష్టి కేంద్రీకరించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటిస్తూ పారిశుధ్య కల్పనపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ప్రజా సంక్షేమంతో పాటు పారిశుధ్య కల్పన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. జనాభాకు అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీలు పారిశుధ్య కార్మికులను నియమించుకోవడం ద్వారా అధ్వాన పారిశుధ్యం నుంచి బయటపడవచ్చనని అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీ పాలక వర్గాలు పారిశుధ్యం విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు

క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల పరిధిలో నున్న ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. 11 మండలాల్లోనున్న పీహెచ్‌సీల్లో ప్రతి రోజు సగటున 200 మంది రోగులు వైద్య సేవలు పొందుతుండగా ఆలమూరు, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం సీహెచ్‌సీల్లో సీహెచ్‌సీల్లో దాదాపు 500 మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. అందులో అధిక సంఖ్యలో రోగులు టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. జ్వరాలకు చికిత్స పొందుతుండగానే రక్తకణాల సంఖ్య తగ్గిపోయి ఒక్కోసారి రోగి ప్రాణప్రాయ స్థితికి చేరుకున్న పరిస్థితులు నెలకొంటున్నాయి.

ఆస్పత్రుల్లో వేధిస్తున్న మందుల కొరత

క్లస్టర్ పరిధిలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఉపయోగించే ఔషధాలు కొరతతీవ్రంగా వేధిస్తోంది. దీనివల్ల రోగులు ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. జ్వరం వస్తే చాలు రూ.వేలల్లో ఖర్చు అవుతోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు



అధిక వర్షాల ప్రభావంతో పాటు వాతావరణంలో మార్పుల వల్ల సంభవించే సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఆయుష్మాన్ మందిరాల ద్వారా రోగులకు తగిన చికిత్స అందించి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నాం. గ్రామ పంచాయతీల సహకారంతో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం.

– ఏటీవీ రాజా అక్కుల, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌సీ పెదపళ్ల

శ్రీమంత్రిప్రగడ సత్రం చైర్మన్‌గా పవన్‌కుమార్



అమలాపురం టౌన్: పట్టణంలో శ్రీమంత్రి ప్రగడ వారి సత్రం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన గొర్తి పవన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ధర్మదాయ దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పట్టణ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు సత్రం చైర్మన్ అయిన పవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. గత 25 ఏళ్లుగా ఓ సామాజిక కార్యకర్తగా శ్రమిస్తున్న పవన్‌కు సత్రం చైర్మన్ పదవి రావడం పట్ల పట్టణ బ్రాహ్మణ సంఘ ప్రతినిధి కొత్తూరి శ్రీను, జనసేన నాయకుడు సూదా చిన్నా తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సత్రం ధర్మకర్తలుగా బండారు లోవరాజు, అనుపోజు శ్రీనివాస్, నూకల లింగయ్యనాయుడు, చొల్లంగి శ్రీలక్ష్మీ భవాని, పాతూరి లక్ష్మీకుమారి, దుబాసి రాజు, పసుపులేటి పద్మ నియమితులయ్యారు.

చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

అమలాపురం టౌన్: సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అమలాపురంలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత మహిపాల వీధిలోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, జిల్లా అధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, చిరంజీవి బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు నల్లా నాయుడు, అభిమాన సంఘాల నాయకులు వర్రే శేషు, గొర్తి పవన్, జనిపరెడ్డి హరి పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు: ఆరు గ్రామాల రైతులకు సంబంధించి లచ్చిపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా మోపూరి వెంకట రెడ్డి నాయుడు, డైరెక్టర్లుగా నీల లోవరాజు, కోరుకొండ వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈఓ కాజులూరి విజయభాస్కరరెడ్డి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. దీనికి ముమ్మిడివరం, యానాం ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గొల్లపల్లి శ్రీనివాస అశోక్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై సభ్యులను సత్కరించారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల ఆవిర్భావ దినోత్సవాన్ని అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు మండేల నాగ వెంకటప్రసాద్ (బాబీ) ఎగురవేశారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు కొండేపూడి సత్యనారాయణ, పరసా సుబ్బారావు, సుంకర ప్రసాద్‌లను యూనియన్ సభ్యులు సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి ఎం.వఫా అబ్బాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పితాని ఈశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కోశాధికారి పాట్టు పోతు నాగు, అమలాపురం నియోజకవర్గ అధ్యక్షుడు అరిగెల రుద్ర శ్రీనివాస్, కార్యదర్శి దొమ్మేటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

అమలాపురం రూరల్: కోనసీమ వాకర్స్ క్లబ్ సభ్యులకు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆంధ్ర ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 50 మంది రక్త నమూనాలు సేకరించారు. ల్యాబ్ నిర్వాహకుడు కిషోర్ మాట్లాడుతూ హిమోగ్లోబిన్, లిక్విడ్ ప్రొఫైల్, ఫాస్టింగ్ షుగర్, సీరం క్రియేటిన్ వంటి పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో రమేష్ రాజు, అయినంపూడి సత్యనారాయణ, నడింపల్లి సూరిబాబు రాజు, నాగిరెడ్డి శివప్రసాద్, పొన్నాడ కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.

పది వేల మందికి వృద్ధాప్య పింఛన్లు

యానాం: వచ్చే నెల నుంచి మరో 10 వేల మందికి కొత్తగా దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు అందించనున్నట్లు సీఎం రంగసామి ప్రకటించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగానే అమరవీరులకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు పెంచిన పింఛన్లను వచ్చే నెల నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కొత్తగా పది వేల మందికి వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నామన్నారు. అమరవీరులకు ఉచిత భూ పట్టాలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎంబీబీఎస్ సీట్లు పెంచాలి

యానాం: పుదుచ్చేరిలో అంతర్భాగంగా ఉన్న యానాం రీజియన్‌కు జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఎంబీబీఎస్ సీట్లు పెంచాలని కోరుతూ ఆదివారం ఎల్జీ కె.కైలాషనాథన్‌కు లేఖ రాసినట్లు మాజీ ఎమ్మెల్యే వెలగా రాజేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరి ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీలో నాలుగు ఎంబీబీఎస్ సీట్లు గత కొన్నేళ్లుగా కేటాయిస్తున్నారన్నారు. యానాం జనాభా మాహే రీజియన్‌ను మించిపోయిందని, మాహేకు ప్రతి ఏడాది 5 ఎంబీబీఎస్ సీట్లు ఇస్తున్నారన్నారు. మాహేతో సమానంగా యానాం కోటా ఎంబీబీఎస్ సీట్లను రాష్ట్ర జనరల్ పూల్ నుంచి తీసుకుని ఐదుకు పెంచాలని కోరారు.

